చెరువులకు మహర్దశ!

- ఆజాదీకా అమృత్ మహోత్సవం పథకం కింద అభివృద్ధి పనులు
- భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పురాతన చెరువుల్లో పూడికతీత
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



పసుపల చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

బనగానపల్లెరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెరువులకు మహర్దశ పట్టింది. పూడిక, కంపచెట్లతో స్వభావమే కోల్పోయిన చెరువులకు పునర్జీవం కల్పించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చెరువుల గట్లు తెగి నీటినిల్వకు నోచుకోని చెరువులకు పూర్వవైభవం తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పథకంలో భాగంగా 'మన ఊరు– మన చెరువు' నినాదంతో భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టింది ప్రభుత్వం. ఆయా గ్రామాల్లో ప్రజల సహకారంతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి చెరువుల్లో అభివృద్ధి పనులు చేట్టారు. తద్వారా చెరువుల్లో నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 80 చెరువుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. పూడిక తీత, ముళ్లపొదల తొలగింపు, చెరువు గట్టును పటిష్టపరుస్తున్నారు.ఫీడర్ ఛానల్స్ ఆధునీకరించడం, తూములు, గేట్లు ప్రధాన కాలువలను బాగు చేస్తున్నారు. డోన్ క్లస్టర్ పరిధిలోని బనగానపల్లె, బేతంచర్ల, డోన్, అవుకు, ప్యాపిలి మండలాల్లోని 25 పురాతన చెరువుల్లో ఉపాధి కూలీలు పనులు పూర్తి చేశారు.

మండలానికి మూడు చెరువుల ఎంపిక

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 మండలాల్లో చిన్న మండలాల్లో రెండు, పెద్ద మండలాల్లో మూడు చెరువులను అధికారులు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్కీం కింద ఎంపిక చేశారు. బనగానపల్లె మండలంలోని చెరువుపల్లె, రామతీర్థం, ఎర్రగుడి, పసుపల గ్రామాల్లోని చెరువులు ఎంపిక య్యాయి. అదేవిధంగా అవుకు మండలంలోని రామాపురం, రామవరం చెరువులు, బేతంచర్ల మండలం రంగాపురం, బుక్కాపురం, ముసలాయి చెరువు, రహీమానుపురం చెరువులను ఎంపిక చేశారు అధికారులు. ప్యాపిలి మండలంలోని పెద్ద పూజర్ల, చిన్నపూజర్ల చెరువులను, డోన్ మండలం వెంకటనాయునిపల్లె, ఉడుములపాడు, ఓబులాపురం, వెంకటాపురం, గుమ్మకొండ, కామసానికుంట్ల, ఉంగరానిగుండ్ల, ఎద్దుపెంట గ్రామాల్లోని చెరువులు ఎంపికయ్యాయి. అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తి కావచ్చాయి. జూలైలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసి స్వాతంత్ర్య వేడుకలు ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

నాణ్యతగా పనులు



అజాదీకా అమృత్‌మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పురాతన చెరువుల్లో పనులు నాణ్యతగా చెప్పట్టడం జరిగింది. మన ఊరు– మన చెరువుల అభివృద్ధి అనే నినాదంతో ఉపాధి కూలీలతోనే చేపట్టాం. చాలా చెరువులు పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోయాయి. చెరువులను అభివృద్ధిలోకి తీసుకోచ్చే విధంగా చర్యలు చేపట్టాం. డోన్ క్లస్టర్ పరిధిలో ఎంపిక అయిన అన్ని చెరువుల్లో అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి.

– శ్రీ విద్యా, డోన్ క్లస్టర్, డ్వామా ఏపీడీ

రైతులకు ఎంతో ఉపయోగం



చెరువుల్లో పూడిక తీత రైతులతో పాటు ప్రజలకు ఎంతో ఉపయోగం. బనగానపల్లె మండలంలో నాలుగు చెరువులను ఎంపికయ్యాయి. అభివృద్ధి పనులు కూడా పూర్తయ్యాయి. ఈ వర్షా కాలంలో చెరువులు నిండితే భూగర్భజలాలు పెరుగుతాయి. దీంతో నీటి సమస్య ఉండదు.

– హరికృష్ణ ఏపీఓ, డ్వామా, బనగానపల్లె మండలం

భూగర్భజలాలు పెరుగుతాయి



పసుపల గ్రామంలోని చెరువును గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండి అధ్వానంగా మారాయి. ఈ చెరువు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కింద ఎంపికకావడంతో ముళ్లపొదలు, పూడికతీత పనులు జరిగాయి. ఈ చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే ఆయకట్టుతో పాటు పసుపల, పసుపల తాండ, బద్రీనాయక్‌తాండ తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి.

– జనార్ధన్‌రెడ్డి,బనగానపల్లె మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు

క్లుప్తంగా

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

కోవెలకుంట్ల: గృహ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, మేజర్ గ్రా మ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వా డకం, సమస్యలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నిరంజన్, ట్రాన్స్‌కో ఏఈ రామసుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన దర్గా

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గా గురువారం భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలతో పాటు వైఎస్సార్, అనంతపురం జిల్లా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు పూలదట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేయు వర్కర్ల, ఆయాలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రోజారమణి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం అఖిలభారత కార్మికుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీఓ ఉమామహేశ్వరమ్మకు అంగన్‌వాడీ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోజారమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని కోరారు.

మృతుని భార్యకు బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సచింద్రబాబు

డోన్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన దివంగత హరిజన పుల్లయ్య కుటుంబ సభ్యులకు పీఎం జేజేబీవై పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ సచింద్రబాబు గురువారం అందజేశారు. పెద్దపుల్లయ్య రెండు నెలల కింద అనారోగ్యంతో మరణించడంతో ఆ వ్యక్తి పేరుపైన ఎస్‌బీఐలో పీఎంజేజేబీవై కింద నమోదు అయ్యింది. దీంతో నామిని అయిన ఆయన భార్య పద్మావతికి ఈ మొత్తం చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌పీలు దస్తగిరి సాహెబ్, ఆదిశంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట సమీపాన జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బైటిపేట, కళ్లాల సంధు, ధరణి టౌన్ షిప్పులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహబూబ్‌వలీ తెలిపారు. కాలనీవాసులు, దుకాణ దారులు గమనించగలరని తెలిపారు.

పండ్ల తోటలు సాగు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ శేషన్న

బేతంచెర్ల: రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగు చేసుకోవచ్చని ఏపీఓ శేషన్న అన్నారు. గురువారం మండలంలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. చిన్న, సన్న కారు రైతులు ఉపాధి హామీ పథకం కింద మామిడి, చీనీ, నిమ్మ, జామ, థైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ రేగు, డ్రాగన్ ఫ్రూట్, గూలాబీ, మల్లె, మునగ సాగు చేపట్టవచ్చునని సూచించారు.

108 వాహనంలో ప్రసవం

బనగానపల్లెరూరల్: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన గిర్భిణి సుమలత గురువారం 108 వాహనంలో సురక్షింతంగా ప్రసవించారు. 108 వాహన ఈఎంటీ నాగార్జున తెలిపిన వివరాల మేరకు సుమలతకు పురిటి నొప్పులు రావడతో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు చేర్పించారు. ప్రసవం కష్టం కావడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు సిఫారసు చేశారు. దీంతో 108వాహనంలో సుమలతను తరలిస్తుండగా గోస్పాడు మండలం పసులపాడు గ్రామ వద్ద నొప్పులు అధికమై ఆడ శిశువుకు జన్మనించ్చింది. ఈ మేరకు నంద్యాల వైద్యశాల లో 108 వాహన సిబ్బంది చేర్పించారు. సుమలత తల్లి నాగేశ్వరమ్మ,భర్త రాము 108 సిబ్బంది కృజత్ఞలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడినట్లు ఎస్‌ఐ కల్పన తెలిపారు. గురువారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి, కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన రైతు చలమయ్య మిరపనార కొనుగోలుకు నంద్యాల వైపు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మండలంలోని రేవనూరు– గుండుపాపల గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. రామచంద్రారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అత్యుత్తమ విద్యను అందించడమే ధ్యేయం



జగనన్న ఆణిముత్యాల విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

డోన్ : పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డోన్ నియోజకవర్గ స్థాయిలో ఇంటర్, ఎస్‌ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా గురువారం ప్రభుత్వం మంజూరు చేసిన నగదు పురస్కారాలను వారు అందజేశారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డోన్ ఎంఈఓ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ. 15 వేలు నగదు అందజేశారు. ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కునిశెట్టి మనీషా, డోన్ జూనియర్ కళాశాల విద్యార్థిని తలారి శశికళ, అంజలిభాయ్, బేతంచెర్ల మోడల్ కళాశాలకు చెందిన సాతర్ల దీపిక లక్ష్మికి నగదు అందజేశారు. అదేవిధంగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డోన్‌కు చెందిన వినయ్‌కుమార్‌కు నగదు అందజేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులను అతిథులు ఘనంగా సత్కరించారు. ఎస్‌ఎస్‌సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డోన్‌కు చెందిన రాణి, వడ్డె డేరంగుల రాము, సాయికార్తీక్‌రెడ్డి, సాయి హర్షిత, బేతంచెర్లకు చెందిన సాయిచరిత, ప్యాపిలికి చెందిన భావనలకు రూ.10వేల నగదు పురస్కారంతో పాటు మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కేడీ యూనివర్సిటీ ఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, ఎంఈఓలు సోమశేఖర్, శ్రీనివాసులు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

పేదల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: పేదల విద్యాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి ప్రాధన్యతనిస్తూ నాడు– నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. పట్టణంలోని పొదుపు భవనంలో గురువారం సాయంత్రం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన బనగానపల్లె నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు, జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ నాడు– నేడు నేడు పథకం ద్వారా బనగానపల్లె నియోజకవర్గంలో 175 పాఠశాలల అభివృద్ధికి రూ.125 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలను ఇతర రాష్ట్రాలు ఆసక్తితో పరిశీలిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం జగన్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే అసూయపడిన చంద్రబాబు తెలుగుభాషను చంపేస్తున్నారంటూ కోర్టుకు వెళ్లారని ఎద్దేవా చేశారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పేదరికం అడ్డురా కుడదన్న ఉద్దేశ్యంతోనే జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. గతంలో 11 మెడికల్ కళాశాలలు ఉండగా నేడు 17 కళాశాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సన్మానం చేశారు. ఉమ్మడి జిల్లాలోనే పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అవుకు ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థి షమీర్‌ను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బనగానపల్లె, సంజామల, అవుకు ఎంఈఓలు స్వరూప, యశోధ, శ్రీధర్‌రావు, బనగానపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, విద్యార్థులు, తల్లిదండులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిశా యాప్‌తో సత్వర రక్షణ



కంభాలపాడు సర్కిల్లో సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్ లోడ్ చేస్తున్న పోలీసులు

డోన్ టౌన్: దిశా యాప్ కలిగిన మహిళలు ఆపద సమయంలో వినియోగిస్తే తక్షణ రక్షణ పొందుతారని పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య అన్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పట్టణంతో పాటు జాతీయ రహదారుల సర్కిళ్లలో పోలీసులు, సచివాయం మహిళా పోలీసులు బృందాలుగా ఏర్పడి దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లలో డౌన్ లోడ్ చేయిస్తూ వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల రక్షణ ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం దిశా యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఆపద సమయంలో మహిళలు ఈ యాప్‌న వాడితే వారు ఎక్కడ ఉన్నది పోలీసులకు సమాచారం అందుతుందని, వెంటనే పోలీసులు వస్తారని రక్షణ కల్పిస్తారని వివరించారు.

మద్దిలేటయ్య నీటి గుండంలో వ్యక్తి గల్లంతు



గల్లంతైన భాస్కర్ (ఫైల్)



నీటి గుండాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, డోన్ ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ సమీపాన నీటి గుండంలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసుల వివరాల మేరకు ప్యాపిలి మండలం పెద్ద పూజర్ల గ్రామానికి చెందిన వల్లె వెంకట్రాముడు కుమారుడు భాస్కర్(45) శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన బంధువు వివాహ కార్యక్రమానికి వచ్చాడు. సరదాగా ఆలయ సమీపాన ఉన్న గుండంలో ఈత కొడుతూ నీట మునిగిపోయాడు. గమనించిన బంధువులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకి తెలియలేదు. దీంతో ఆలయ సిబ్బంది బేతంచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. బేతంచెర్ల పోలీసులు, డోన్ ఎన్డీఆర్ ఎఫ్ సిబ్బందితో సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఆచూకి తెలియలేదు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నక్కి శ్రీకాంత్,శివరామ్ మాట్లాడారు. పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాళ్లు నాగలక్ష్మి, మేరీ, రాజేశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

19నుంచి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు ఈనెల 19వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రూపులు ఉన్నాయని, ఆధునిక ల్యాబ్‌లు, ఎన్‌సీసీ పూర్తి స్థాయి అందుబాటులో ఉండటమే కాకుండ డాక్టరేట్ అధ్యాపకులతో బోధన చేయిస్తున్నామన్నారు. స్థానిక కళాశాలలోనే ఆన్‌లైన్ ఉచితంగా చేస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తండ్రిని ధూషించిన కొడుకుపై కేసు

సంజామల: కుమారుడు తనను ధూషించాడని మండల పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన శీల్ల పుల్లయ్య పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు పుల్లయ్య తన పొలాన్ని ముగ్గురు కుమారులకు సమానంగా పంచాడు. ఇద్దరు కుమారులు విదేశాల్లో స్థిరపడ్డారు. అయితే ఇద్దరి కుమారులకు వచ్చిన పొలం వాటాను కౌలుకు ఇవ్వకుండా పెద్దకుమారుడు అడ్డుపడుతున్నాడు. సమంజసం కాదన్న తనను పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు ధూషిస్తున్నాడని పుల్లయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

డోన్ టౌన్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, రామాంజనేయులు, కుల్లాయప్ప, పెద్ద ఎల్లయ్య, దేవదానం, బలరాముడు, అవులయ్య, సుంకన్న, ఏసు, అంజనమ్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి,మాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: నీట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి గురువారం సత్కరించారు. అవుకు పట్టణానికి చెందిన సూర వివేకానందరెడ్డి 589 (720) మార్కులు, తాలెపల్లె పల్లవి 575 మార్కులు, తాలెపల్లె పవిత్ర 554 మార్కులు, బేరి మహిత 538 మార్కులు సాధించారు. ఈ మేరకు నలుగురు విద్యార్థులను చల్లా శాలువాలతో సత్కరించారు. అదేవధంగా ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి విద్యార్థులను అభినందించారు.

చల్లా విఘ్నేశ్వర్ రెడ్డికి గన్‌మెన్ కేటాయింపు

అవుకు: వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు వన్ ప్లస్ వన్ గన్‌మెన్‌లను కేటాయించారని స్థానిక చల్లా కార్యాలయ సమాచారం. ఈ మేరకు గురువారం గన్‌మెన్లు రిపోర్టు చేసుకున్నారు.

వివేకానంద విగ్రహం ఏర్పాటుకు సహకరించండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : భారతదేశ సంస్కృతిని, హిందూ సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసి యువతకు ఆదర్శంగా నిలిచిన స్వామివేవేకానంద విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వివేకానంద సేవా సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు. విగ్రహ ఏర్పాటు కోసం ముద్రించిన కర పత్రాలను, బ్రోచర్లను గురువారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో విడుదల చేశారు. దాతలు స్పందించి విరివిగా విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకులు మలిశెట్టి జగన్ మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు సప్తశైల తిమ్మయ్య, కమిటీ సభ్యులు తోగట సురేష్‌బాబు, సర్వజ్ఞమూర్తి, శ్రీనివాసులు, గుంటూరు శ్రీనివాసులు, కురుకుంద శేఖర్, విజయభట్టు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్



హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్ కుమార్

డోన్ టౌన్: హోంగార్డులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, అప్పుడే గుర్తింపు లభిస్తుందని హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో గురువారం హోంగార్డ్స్ నిర్వహించిన పేరేడ్ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్చ్ పాస్ట్ చేయించి క్రమ శిక్షణపై సూచనలు చేశారు. విధులను సక్రమంగా నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కృషి చేయాలని సూచించారు. అనంతరం హోంగార్డుల వివరాలు తెలుసుకుని సమస్యలపై ఆరా తీశారు.

హోంగార్డు కుటుంబానికి రూ.51030 విరాళం

ప్యాపిలి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన రమేష్ తల్లిదండ్రులకు హోంగార్డులు తమవంతు సాయంగా రూ.51030 అధికారుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య, హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ బద్దూనాయక్, పీఎల్‌సీ రామయ్య, సీసీ వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్‌రెడ్డి, మునిస్వామి, భాస్కర్, ఇమామ్, నాగరాజు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సొంతిళ్లు లేని ప్రతి హోంగార్డుకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని, ప్రవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఫీజులో 35శాతం రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవానలి కోరుతూ హోంగార్డులు కమాండెంట్ మహేష్ కుమార్‌కు విన్న వించారు. స్పందించిన ఆయన ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలతో మాట్లాడాలని సీఐ శేషయ్యకు సూచించారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులతో సంప్రదించి ఇంటి స్థలాలు కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్ల విరాళం



ఫ్యాన్‌లు అందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న శ్రీకాశిరెడ్డినాయన వృద్ధాశ్రమానికి గురువారం ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు దాతలసహకారంతో రెండు ఫ్యాన్‌లను విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన ఓలేటిమాధవస్వామి, దివంగత డాక్టర్ సీతారామయ్య భార్య సూర్యకుమారి ఆర్థిక సాయంతో ఫ్యాన్‌లు అందజేశామని క్లబ్ అధ్యక్షురాలు శాంతి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుజాత, శారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బందెనవాజ్ ఉరుసు



ఊరేగింపు చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి కాలనీలోని ఖాజా బందెనవాజ్ దర్గాలో ఉరుసు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున దర్గా నుంచి స్వామివారి శంషేర్‌ను పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మేళ తాళాల మధ్య సాగిన గ్రామోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దర్గా అవరణంలో అన్నదానం నిర్వహించారు.

కోలుకోలేక బీహార్ యువకుడి మృతి

డోన్ టౌన్:స్థానిక రైల్వే స్టేషన్‌లో కొద్దిరోజులు క్రితం గాయపడి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీహార్ వాసి సంతోష్(32) గురువా రం కోలుకోలేక మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. డోన్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైల్ ఇంజిన్ పైకి సంతోష్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి దూకడంతో విద్యుత్ షాక్‌కు గురికావడంతో తీవ్రగాయపడ్డాడు. మృతుని వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. మృతుదేహాన్ని పోస్టుమార్టరం నిమ్మిత్తం మార్చురీకి తరలించామని,బీహార్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూల్ బస్‌లను సీజ్ చేయండి

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని స్కూల్ బస్‌లను సీజ్ చేయాలని కోరుతూ గురువారం డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి విజయ్‌ను వినతి పత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ స్కూల్ బస్సులకు ఎఫ్‌సీ (ఫిట్‌నెస్)చేయించుకోకుండా తిప్పుతున్నారని, తనిఖీలు చేపట్టి సీజ్ చేయాలని విజయ్ కోరారు.

నివాళి

బనగానపల్లెరూరల్: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్దకుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి ఆరవ వర్ధంతిని గురువారం నిర్వహించారు. పట్టణంలోని అవుకు రోడ్డులో ఉన్న కాటసాని నాగార్జున రెడ్డి ఘాట్ (సమాధి) వద్ద ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రవికుమార్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.